నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, శనివారం 1 మార్చి 2025 | NIZAMABAD

# తాగునీటి కోసం ధర్నా

- ఖాళీ బిందెలతో మహిళల నిరసన
- 13వ డివిజన్‌లో నీటి కష్టాలు
- పట్టించుకోని అధికారులు

కంఠేశ్వర్, ఫిబ్రవరి 28: తాగునీటి కోసం మహిళలు రోడ్డెక్కారు. నిజామాబాద్ కార్పొరేషన్ పరిధిలోని 13వ డివిజన్ మహిళలు ఖాళీ బిందెలతో బోధన్, నిజామాబాద్ ప్రధాన రహదారిపై శుక్రవారం నిరసన వ్యక్తంచేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మూడు నెలల నుంచి తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. సమస్యను పరిష్కరించాలని కార్పొరేషన్ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. ప్రజావాణిలో ఫిర్యాదు ఇచ్చినా ఫలితంలేకుండా పోయిందని, తమను పట్టించుకునే నాథుడే కరువయ్యాడని వేదన వ్యక్తం చేశారు. అధికారులకు చిత్తశుద్ధి ఉంటే ఒకసారి తమ కాలనీని సందర్శించాలని కోరారు.

**నిరుపయోగంగా వాటర్ ట్యాంకులు**

డివిజన్‌లో రెండు మినీ వాటర్ ట్యాంకులున్నా నిరుపయోగంగా ఉన్నాయని, బోరుమోటర్లు కాలిపోయినా పట్టించుకునే నాథుడు లేడన్నారు. తాగునీటి సమస్యతోపాటు మురికి కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం పేరుకుపోయి దుర్గంధం వ్యాపిస్తున్నదని వాపోయారు. నాయకులకు ఎన్నికల్లో మాత్రమే తాము గుర్తుకువస్తామని, ఈసారి ఎన్నికల్లో ఎవరైనా ఓట్లు అడగడానికి వస్తే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. డివిజన్‌లోని సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని స్పష్టంచేశారు.


13వ డివిజన్‌లో మినీ ట్యాంకు వద్ద ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

**రెండు గంటలపాటు నీరందించాలి**



తాగునీటి కోసం నానా ఇబ్బందులు పడుతు న్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి. ఉదయం, సాయంత్రం రెండు పూటలా రెండు గంటలపాటు నీటిని సరఫరా చేయాలి.

**-గంగామణి**

**అధికారులు స్పందించాలి**



గతంలో తాగునీటి కోసం ఇలాంటి ఇబ్బందులు ఎ ప్పుడూ పడలేదు. ఇప్పు డే ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఇప్పటికై నా అధికారులు స్పం దించి నీటి సమస్యను పరిష్కరించాలి.

**-పల్లెపు నీల**

## 'నమస్తే'కు స్పందించిన కమిషనర్


13వ డివిజన్‌లో సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్

13వ డివిజన్‌లో తాగునీటి కోసం మహిళలు చేపట్టిన ఆందోళన వార్త నమస్తే తెలంగాణ వెబ్ ఎడిషన్‌లో ప్రచురితమవగా కార్పొరేషన్ కమిషనర్ దిలీప్‌కుమార్ స్పందించారు. మధ్యాహ్నం డివిజన్‌లో పర్య టించారు. సమస్యలను తెలుసుకున్నారు. బోరు మో టర్లను వెంటనే సరిచేసి వాటర్ ట్యాంకులను ఉపయోగంలోకి తేవాలని ఏఈ, డీఈలను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగితే సహించేది లేదన్నారు. నీటి విషయంలో ఎటువంటి ఇబ్బందులూ లేవని, ప్రజల డిమాండ్ మేరకు గృహావసరాలకు నిరంతర నీటి సరఫరా జరిగేలా స్టాటిక్ ట్యాంకుకు కనెక్షన్ ఇవ్వాలని ఏఈని ఆదేశించినట్లు తెలిపారు.

## బాబ్లీ నుంచి నేడు నీటి విడుదల

మోర్తాడ్, ఫిబ్రవరి 28: మహారాష్ట్రలో నిర్మించిన బాబ్లీ ప్రాజెక్ట్ నుంచి 0.60 టీఎంసీల నీటిని శనివారం విడుదల చేయనున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ప్రతి సంవత్సరం మార్చి 1న బాబ్లీ ప్రాజెక్ట్ నుంచి 0.60టీఎంసీల నీటిని విడుదల చేయాలి. ఇందులోభాగంగా నేడు నీటిని విడుదల చేయనుండగా, ఈ కార్యక్రమంలో గోదావరి డివిజన్ ఈఈ వెంకటేశ్వర్లు, పోచంపాడ్ ప్రాజెక్ట్ ఈఈ చక్రపాణి, నాండేడ్ ఇరిగేషన్ ఈఈ బన్సోద్ పాల్గొననున్నారు.

## చివరికి అందని జలాలు







**వేసవికి ముందే** ఉమ్మడి జిల్లాలోని పలు మండలాల్లో డేంజర్ బెల్స్ మోగుతున్నాయి. గ్రామాల్లో రోజురోజుకూ భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. దీంతో పంట పొలాలకు సాగునీరందక ఎండుముఖం పడుతుండడంతో రైతన్నలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. సిరికొండ మండలంలోని పలు గ్రామాల్లో సాగునీరందక పంటలు ఎండిపోతున్నాయి. దీంతో రైతులు ప్రత్యామ్నాయంగా ట్యాంకర్లను ఆశ్రయిస్తున్నారు. ఒక్కరోజుకు రూ.800 చెల్లించి ట్యాంకర్ ద్వారా పంట పొలాలకు నీళ్లను అందిస్తున్నామని రైతులు గంగాధర్, గంగారెడ్డి, శ్రీనివాస్ తెలిపారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

# సాగునీరు అందించాలని అధికారుల నిర్బంధం

- సాలూర గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉంచి తాళం వేసిన రైతులు
- నిజాంసాగర్ కెనాల్ నీటిని చివరి ఆయకట్టుకు అందించాలని డిమాండ్

బోధన్ రూరల్, ఫిబ్రవరి 28: నిజాంసాగర్ కెనాల్ నీళ్లు చివరి ఆయకట్టు వరకు అందించాలని డిమాండ్ చేస్తూ సాలూర మండలంలోని సాలూర క్యాంప్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం నీటి పారుదలశాఖ అధికారులను రైతులు నిర్బంధించారు. అధికారులను గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉంచి తాళం వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిజాంసాగర్ కెనాల్ డి-28 కింది చివరి ఆయకట్టుకు నీటిని అందించి పంటలను కాపాడాలని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. అధికారుల నిర్లక్ష్యంతో పంటలు ఎండిపోయే పరిస్థితి వచ్చిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. నిజాంసాగర్ కెనాల్ నీటి విడుదల చేసి ఏడు రోజులవుతున్నా కింది ఆయకట్టుకు నీళ్లు అందడంలేదని వాపోయారు. ఇంకా రెండు, మూడు రోజుల్లో కెనాల్ నుంచి నీటి విడుదల నిలిచిపోతుందని, అప్పుడు ఏం చేయాలని అధికారులను నిలదీశారు. విషయం తెలుసుకున్న బోధన్ రూరల్ సీఐ విజయ్ బాబు, ఎస్సై మశ్చేందర్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని రైతులతో మాట్లాడి సముదాయించారు. అధికారులు , రైతులు కలిసి డి- 28 ప్రధాన కాలువ వద్దకు వెళ్లారు.


పంచాయతీ కార్యాలయంలో అధికారులను నిర్బంధించిన రైతులు

**చివరి ఆయకట్టుకు నీటిని అందించాలి**



నిజాంసాగర్ నీళ్లు చివరి ఆయకట్టు పరిధిలోని మా పంటలకు అందడం లేదు. నీటి పారుదలశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు. ఇచ్చిన కూడా కూడా కాలువలో సగం కూడా రావడంలేదు.ఇలాగే కొనసాగితే మా పంటలు ఎండిపోయే పరిస్థితి ఉంది. అధికారులు స్పందించి చివరి ఆయకట్టు వరకు నీటిని అందేలా చూడాలి.

**-పాలెటి శ్యాంబాబు, రైతు, సాలూర క్యాంప్**

**అధికారులు పట్టించుకోలే..**



నిజాంసాగర్ కెనాల్ నీటి వదలి వారం రోజులువు న్నది. డి -28 కెనాల్ చివరి ఆయకట్టు వరకు నీళ్లు అందలేదు. బోర్లు ఎత్తిపోయినాయి. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. రేపు మారో నిజాంసాగర్ మెన్ కెనాల్ బంద్ అయితది. ఎండాకాలం పంటలు ఎండిపోయే అవకాశం ఉంది. అధికారులు వెంటనే స్పందించి చివరి ఆయకట్టు వరకు నీటి అందేలాచూడాలి.

**-విజయ్ భాస్కర్‌రెడ్డి , రైతు, సాలూర క్యాంప్**


సాలూర క్యాంప్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో అధికారులను బంధించి తాళం వేస్తున్న రైతులు

### నిజాంసాగర్ కాలువను పరిశీలించిన అధికారులు

రుద్రూర్, ఫిబ్రవరి 28: సాలూర క్యాం ప్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో నీటి పారుదలశాఖ అధికారుల నిర్బంధంపై ఉన్నతాధికారులు స్పందించారు. ఇరిగేషన్ ఎస్ఈ బద్రినారాయణ, కామారెడ్డి ఎస్ఈ రాజశేఖర్ కలిసి నిజాంసాగర్ కెనాల్‌ను పరిశీలించారు. వర్ని మండలంలోని నిజాంసాగర్ డీ-20 కాలువను పరిశీలించి కింది స్థాయి అధికారులకు పలు సూచనలు చేశారు. అక్రమ నీటి వినియోగాన్ని అరికట్టాలని ఆదేశించారు. కాలువ లీకేజీలకు మరమ్మతులు చేపట్టాలని, చివరి ఆయకట్టు వరకు నీరు అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. మరో ఐదు రోజులు కాలువ నీళ్లు వచ్చే అవకాశం ఉన్నందున సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డీఈ భూమన్న, బల్‌రాం ఉన్నారు.

# ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం!

- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు
- పరీక్షలకు నిజామాబాద్‌లో హాజరుకానున్న 36, 222 మంది, కామారెడ్డిలో 18,469 మంది విద్యార్థులు
- ఈ నెల 5 నుంచి 25 వరకు కొనసాగనున్న ఎగ్జామ్స్
- ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాల ఏర్పాటు
- నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ
- గంట ముందే సెంటర్లకు చేరుకోవాలని సూచిస్తున్న అధికారులు



కామారెడ్డి/ ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 28: ఉమ్మడి జిల్లాలో ఈ నెల 5 నుంచి నిర్వహించనున్న ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈ పరీక్షలు ఈ నెల 25వ తేదీ వరకు కొనసాగనున్నాయి. పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందుకోసం నిజామాబాద్ జిల్లాలో 57, కామారెడ్డిలో 38 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. నిజామాబాద్ జిల్లాలో మొత్తం 36,222 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని ఇంటర్ జిల్లా విద్యాధికారి రవికుమార్ తెలిపారు. ఫస్టియర్ జనరల్ విద్యార్థులు 15,053 మంది, ఒకేషనల్ విద్యార్థులు 2736 మొత్తం 17,789 విద్యార్థులు ఉన్నారని పేర్కొన్నారు. ద్వితీయ సంవత్సరం జనరల్ రెగ్యులర్ 13,944 మంది, ప్రైవేట్ 2126 మంది, ఒకేషనల్ రెండవ సంవత్సరం రెగ్యులర్ 2042 మంది, ప్రైవేట్ 319 మంది విద్యార్థులు హాజరుకానున్నారని వివరించారు.

**కామారెడ్డి జిల్లాలో..**

కామారెడ్డి జిల్లాలో మొత్తం 18,469 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందులో జనరల్,ఒకేషనల్‌కు సంబంధించి ప్రథమ సంవత్సరం 8,743 మంది, ద్వితీయ సంవత్సరం 9,726 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్షల నిర్వహణకు 38 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, తొమ్మిది మంది అసిస్టెంట్ చీఫ్ సూపరింటెండెంట్లు, ఆరుగురు సిట్టింగ్ స్క్వాడ్‌లు, ఇద్దరు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. సుమారు 800 మంది పైగా ఇన్విజిలేటర్లను నియమించారు. వీరితోపాటు రెవెన్యూ, పోలీస్, వైద్య విభాగం ఇతర విభాగాల నుంచి పరీక్ష నిర్వహణలో పాల్గొంటూ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటారు.

**అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం..**



ఇంటర్ వార్షిక పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. మాస్ కాపీయింగ్ జరగకుండా అన్ని చర్యలు తీసుకున్నాం. నిమిషం ఆలస్యంగా వచ్చినా పరీక్షాకేంద్రంలోకి అనుమతించబోం. విద్యార్థులు పరీక్ష సమయానికి గంట ముందే కేంద్రాలకు చేరుకోవాలి.

**-షేక్ సలాం, కామారెడ్డి జిల్లా ఇంటర్ నోడల్ అధికారి**

### పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు..

వేసవి దృష్టిలో ఉంచుకొని ఇంటర్ జిల్లా విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు చేస్తున్నది. విద్యార్థులకు తాగునీరు, వైద్య సిబ్బంది, పార్కింగ్ వసతి, వాష్ రూమ్స్, ఫ్యాన్ సౌకర్యం, రాత బల్లలు, విద్యుత్ సౌకర్యాలు కల్పించనున్నారు. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నారు. జిరాక్స్ సెంటర్ల మూసివేయనున్నారు. పరీక్షా హాలులోకి అరగంట ముందు విద్యార్థులను అనుమతిస్తారు. ఉదయం 8.30 గంటల్లోపు పరీక్షా కేంద్రంలో ఉండాలి. ఉదయం 8 నుంచి 8.45 గంటల్లోగా విద్యార్థులు తమకు కేటాయించిన పరీక్షా కేంద్రాల్లో తమ సీట్లలో కూర్చోవాలని అధికారులు సూచిస్తున్నారు. నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. వివిధ గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులు ఉదయం 8 గంటల్లోగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని ఇంటర్ విద్యా శాఖ అధికారులు సూచిస్తున్నారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. మాస్ కాపీయింగ్ జరగకుండా అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రానికి చేరుకునేలా ఆర్టీసీ బస్సులను నడిపేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

# ఇసుక వాహనాలు సీజ్

మాచారెడ్డి, ఫిబ్రవరి 28 : మాచారెడ్డి, పాల్వంచ మండలాల్లోని పలు గ్రామాల్లో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతున్నది. అడ్డూ అదుపులేకుండా కొనసాగుతున్న ఇసుక దందాపై నమస్తే తెలంగాణ దినపత్రికలో 'వాగులనూ తోడేస్తున్నారు' అనే శీర్షికన శుక్రవారం కథనం ప్రచురితమైంది. దీనిపై పోలీసులు స్పందించి ఇసుక అక్రమ రవాణాపై కొరడా ఝుళిపించారు. పాల్వంచ మర్రి వద్ద ఇసుక లారీతోపాటు మంథనిదేవునిపల్లి గ్రామశివారులో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని సీజ్ చేశారు. ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో ఇసుక డంపులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

**ఇసుక డంపులు ఖాళీ చేయాలని ఆదేశాలు..!**

ఆయా గ్రామాల్లోని వాగు శివారుల్లో ఉన్న ఇసుక డంపులను ఖాళీచేయాలని రెవెన్యూ అధికారులు ఇసుకాసురులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. నమస్తే తెలంగాణ దినపత్రికలో 'వాగులనూ తోడెస్తున్నారు' శీర్షికన ప్రచురితమైన కథనంపై రెవెన్యూ అధికారులూ అప్రమత్తమయ్యారు. ఆయా గ్రామాల శివారుల్లో ఉన్న ముఖ్యమైన వ్యక్తులకు డంపులు చేయవద్దని, నిల్వ చేసిన ఇసుక డంపులను వెంటనే ఖాళీ చేయాలని సూచించినట్లు సమాచారం. దీంతో ఇసుకాసురులు డంపులను ఖాళీ చేసినట్లు తెలిసింది. ఇసుక అక్రమ రవాణాపై ఆయా గ్రామాల ప్రజలు జిల్లా స్థాయి అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు సమాచారం.


మంథనిదేవునిపల్లి గ్రామశివారులో ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్న పోలీసులు

# ఇద్దరు మావోయిస్టుల లొంగుబాటు

- వారికి సహాయ, సహకారాలు అందిస్తాం..
- జిల్లాలో ఎలాంటి 'మావో'కార్యకలాపాలు లేవు
- విలేకరుల సమావేశంలో కామారెడ్డి ఎస్పీ సింధూశర్మ వెల్లడి

కామారెడ్డి, ఫిబ్రవరి 28 : మావోయిస్టుల సిద్ధాంతాలు నచ్చక ఇద్దరు మావోలు లొంగిపోయినట్లు కామారెడ్డి ఎస్పీ సింధూశర్మ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్ర వారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరా లను వెల్లడించారు.నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీ సభ్యులైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చెర్ల గ్రామానికి చెంది న గుర్రాల విజయ్ కుమార్,అలియాస్ ఆకాశ్, చత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా ఉట్టపల్లి గ్రామానికి చెందిన సోడి బాలకృష్ణ లొంగిపోయినట్లు తెలిపారు. వీరు పలు కేసుల్లో కీలక పాత్రధారులుగా ఉన్నట్లు చెప్పారు. సీపీఐ మావో యిస్టు పార్టీ పతనం అంచున ఉన్నదని, చత్తీస్‌గఢ్‌లో జరుగుతున్న ఘటనలు చూసి పార్టీలో కొనసాగడం సరికాదని లొంగిపోయారని తెలిపారు.



వివరాలను వెల్లడిస్తున్న కామారెడ్డి ఎస్పీ సింధూశర్మ

**జిల్లాలో ఐదుగురు అజ్ఞాతంలో...**

కామారెడ్డి జిల్లాలో ఐదుగురు అజ్ఞాతంలో ఉన్నారని ఎస్పీ తెలిపారు. కామారెడ్డి మండలం ఇస్రోజీవాడి గ్రామానికి చెందిన లోకోటి చందర్ రావు అలియాస్ పడకాల స్వామి వెస్ట్ సబ్ జోనల్ బ్యూరో కార్యదర్శిగా ఉన్నాడని తెలిపారు. ఇతనిపై రూ.20 లక్షల రివార్డు ఉండగా 1995 నుంచి అజ్ఞాతంలో ఉన్నాడని తెలిపారు. మాచారెడ్డి మండలం ఆరేపల్లి గ్రామానికి చెందిన ఎర్రగొల్ల రవి అలియాస్ దినేశ్, ఏసీఎం, ఆజాద్ ప్రొటెక్షన్ టీంలో ఉన్నాడని తెలిపారు. ఇతడిపై రూ.5 లక్షల రివార్డు ఉండగా, 2001 నుంచి అజ్ఞాతంలో ఉన్నాడని పేర్కొన్నారు. కామారెడ్డి మండలం ఇస్రోజీవాడి గ్రామానికి చెందిన లోకోటి రమేశ్ అలియాస్ స్వామి, డీసీఎం,ఇన్‌చార్జి కొంటా ఏసీ, సౌత్ బస్తర్ డీవీసీగా ఉన్నాడని తెలిపారు. ఇతడిపై రూ.5 లక్షల రివార్డు ఉండగా 2009 నుంచి అజ్ఞాతంలో ఉన్నాడని తెలిపారు. ఇస్రోజీవాడి గ్రామానికి చెందిన లోకోటి లావణ్య ఏసీఎం గా పనిచేస్తున్నదని తెలిపారు. ఆమెపై రూ.4 లక్షల రివార్డు ఉండగా 2009 నుంచి అజ్ఞాతంలో ఉన్నాడని పేర్కొన్నా రు. ఇందులో ఒకే కుటుంబం నుంచి లోకోటి చందర్ రావు, లోకోటి రమేశ్, లోకోటి లావణ్య ఉన్నారని వివరిం చారు. అజ్ఞాతంలో ఉన్నవారు జనజీవన స్రవంతిలో కలవాలని, అన్ని విధాల సహకారాలు అందిస్తామన్నారు. ప్రస్తుతం లొంగిపోయిన ఇద్దరికి పోలీసు శాఖ తరపున సహాయ, సహకారాలు అందిస్తామని చెప్పారు.జిల్లాలో మావోల కార్యకలాపాలు లేవని తెలిపారు. అదనపు ఎస్పీ నర్సింహారెడ్డి పాల్గొన్నారు.